## క్లుప్తంగా

### అంబటిని కలిసిన ఎస్టీ విభాగం నేతలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన చిన్నపోతు దుర్గారావు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతనంగా పదవులు వచ్చిన ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. భవిష్యత్తులో పార్టీ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఈదులుమూడి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: కార్యకర్తలకు అన్ని విధాలా అండగా నిలవడంతో పాటు వారి ప్రతి కష్టంలో తోడుగా నిలుస్తామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. కంటి నరం దెబ్బతిని శంకర కంటి ఆసుపత్రిలో చికిత్స అనంతరం పాట్టి శ్రీరాములు నగర్ 7వ లైనులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీ మోహన రంగనాయక స్వామి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు రాచపూడి సుబ్బరాజును ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, బోడపాటి కిషోర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు రెడ్డి కోటేశ్వరరావు, ప్రసన్న, శంకర్, పండ్ల నారాయణ, చందు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా హిందీ ప్రచార సభ పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో పరిచయ, ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహించిన పరీక్షలకు 50 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల కరస్పాండెంట్ డీవీ సుబ్బారావు తెలిపారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.మాపసవీణ వ్యవహరించారు.

### విజయవాడలో పేరుకే రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ

చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా



నగరంపాలెం: ఏపీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిసారించాలని మా ఏపీ వ్యవస్థాపకులు, చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దిలీప్‌రాజా మాట్లాడుతూ ఇప్పటి దాకా ఎఫ్.డి.సి.చైర్మన్‌ను నియమించకపోవడం దురదృష్టకరమని అన్నారు. పేరుకే రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉందని, అందులో చైర్మన్, ఎండీ, జీఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఏపీలో యుద్ధప్రాతిపదికన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి నిర్ణయాలు చేపట్టాలని సీఎంను కోరారు.

### జీకేఆర్ హైస్కూల్లో హిందీ భాషా దినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురం, ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్ క్యాంపస్‌లలో ఆదివారం జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. హిందీభాషలో వ్యాసరచన, పాఠ్యాంశాల పఠనం, డిక్టేషన్, చేతిరాత పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ హిందీ భాష గొప్పతనాన్ని విద్యార్థులు తప్పక తెలుసుకోవాలని, జాతీయ భాషగా గుర్తింపు పొందిన భాషగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బృందావన్‌గార్డెన్స్ ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న నీరు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరిస్థితి

# • రెండోరోజు ముంచెత్తిన వాన

నగరాన్ని రెండురోజూ ముంచెత్తింది. భారీ వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. వీధుల్లో చేరిన నీటితో ప్రజలు అవస్థలు పడ్డారు. చంద్రమౌళినగర్‌లో ఓ భారీ వృక్షం కారుపై పడింది. డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షం నీరు బయటకు వెళ్లడం ఆలస్యం కావడంతో నగరవాసులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు/ నెహ్రూ నగర్



బొంగరాలబీడు మోకాళ్లలోతు నీళ్లల్లో నగర వాసులు



పట్టాభిపురం రోడ్డులో నీటి ప్రవాహానికి పడిపోయిన ద్విచక్రవాహనం

## ‘చేబ్రోలు’ కుటుంబ సేవలు అభినందనీయం

నగరంపాలెం: చేబ్రోలు హనుమయ్య కుటుంబ సభ్యులు నిరంతరం అభివృద్ధి కోసం పరితపించే వారని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు శ్రీకన్వెన్షన్ హాల్‌లో ఆదివారం మాజీ మంత్రి, దివంగత చేబ్రోలు హనుమయ్య పెద్ద కోడలు చేబ్రోలు సరస్వతీదేవి సంస్మరణ సభ నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు హాజరై, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చేబ్రోలు వారి కుటుంబంతో ఉన్న అనుబంధం ప్రత్యేకమైనదని అన్నారు. ఆమె భర్త రాజేంద్రప్రసాద్ సహా కుటుంబ సభ్యులు అందరూ తనపై చూపే గౌరవాభిమానాలు మరువలేనివని అన్నారు. చేబ్రోలు సరస్వతీదేవి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

**ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సంతాపం..**

పట్నంబజారు: మాజీ మంత్రి చేబ్రోలు హనుమయ్య తనయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త చేబ్రోలు రాజేంద్ర ప్రసాద్ సతీమణి సరస్వతీదేవీ సంస్మరణ సభకు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం చేబ్రోలు రాజేంద్ర ప్రసాద్, ఆయన కుమారుడు అశోక్, చేబ్రోలు నరేంద్ర ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సరస్వతీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సంతాపం తెలియజేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

## నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ డిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదు

గుంటూరు మెడికల్: షుగర్, కిడ్నీ, క్యాన్సర్, ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితుల్లో, విచ్చలవిడిగా స్టిరాయిడ్స్ వాడే వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని తద్వారా వారిలో వివిధ రకాల సూక్ష్మజీవులు చర్మ వ్యాధులను కలుగజేస్తాయని డెర్మటాలజిస్ట్ డి.అమర్ తెలిపారు. స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో గజ్జి వంటి పారా సైటిక్ వ్యాధులతో పాటు అనేక బ్యాక్టీరియల్, ఫంగల్, వైరల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజలలోఆరోగ్య విషయాలపై శాస్త్రీయ అవగాహన లక్ష్యంగా ప్రతినెల ఈ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ అమర్ చర్మ వ్యాధుల బాధితులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. దంత వైద్యులు డాక్టర్ చల్లా చైతన్య ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు టి.వి.సాయిరాం, మేకల రామారావు, ఎస్.సాంబశివరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ డి.అమర్

## వేరికోస్ వీన్స్ బాధితులు ఇద్దరికి జీజీహెచ్‌లో లైవ్ సర్జరీ

గుంటూరు మెడికల్: వేరికోస్ వీన్స్ సమస్య(కాళ్లలో రక్తనాళాలు ఉబ్బటం)తో బాధపడుతున్న ఇరువురు రోగులకు ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో లైవ్ సర్జరీలు చేశారు. వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రిషికృష్ణ విచ్చేసి వేరికోస్ వీన్స్ ఎలా గుర్తించాలి, ఎలా చికిత్స అందించాలనే విషయాలపై పీజీ వైద్యులకు వివరించి లేజర్ పరికరంతో స్థానిక మత్తుతో(ట్యూమ్‌సెన్స్ ఎనస్థీషియా) లైవ్‌లో ఇద్దరికి సర్జరీ చేసి చూపించారు. ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, రేడియాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సాంబశివరావు సహకారంతో సర్జరీలు విజయవంతంగా నిర్వహించారు. హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాపులో పీజీ వైద్యులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్జరీలు లైవ్‌లో చేసి చూపించటం ద్వారా వారు త్వరితగతిన నేర్చుకుని వృత్తిలో రాణించేందుకు వీలు కలుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వి. సుందరాచారి పేర్కొన్నారు. జనరల్ సర్జరీ వైద్యులను అభినందించారు. జనరల్ సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ కట్టా శ్రీనివాస్, డాక్టర్ వనజ, డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



డాక్టర్ రిషికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

## జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ

నగరంపాలెం: సమాజ మనుగడకు సాహిత్యం, కళలు దోహదం చేస్తాయని డాక్టర్ పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ హాల్‌లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను సాహితీవేత్తలు ఆవిష్కరించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, మల్లెతీగ సాహిత్యసేవా సంస్థతో భాగస్వామ్యమై రచయితలు, కళాకారులు, కార్టూనిస్టుల కోసం ఈ ఏడాది నవంబర్‌లో ఒక గొప్ప సాహిత్య సాంస్కృతిక సంబరాన్ని విజయవాడలో నిర్వహించడం అవసరంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాల కమిటీ గుంటూరు పట్టణ కార్యదర్శి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ ఏ విధమైన రుసుం చెల్లించకుండానే ప్రతినిధుల అందరికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని అన్నారు. వివరాల కోసం 9246415150, 83329 03156లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, గాయకుడు ఎస్‌పీ ప్రసాద్ పాల్గొన్నారు.



జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు పోస్టర్ ఆవిష్కరించిన సాహితీవేత్తలు

## నిరుద్యోగుల వినూత్న నిరసన

లక్ష్మీపురం: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత ఆవేదనలో మునిగిపోతున్నారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతి రూ.3,000 చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం అర్ధనగ్నంగా పండ్లు విక్రయిస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించాల్సిందిగా, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, గంజాయి తాగిన వారితో మహిళలకు, ప్రజలందరికీ తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్న ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టమని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, నాయకులు అరుణ్, సద్దాం పాల్గొన్నారు.





అర్ధ నగ్నంగా వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంతో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పొలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, కోశాధికారి ఎస్‌వీ రమణ, మురళీసాయి, వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

### యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటిని తొలగించాలి



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్ల మీదకు చేరిన వర్షపు నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. బృందావన్ గార్డెన్స్‌లో కారుపై పడిపోయిన చెట్టును వెంటనే తొలగించాలని ఏడీహెచ్‌ను ఆదేశించారు. ఎక్కడైన చెట్లు పడిపోతే జీఎంసీ కాల్ సెంటర్‌కు 0863–2345103 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

### వ్యక్తిపై ఇనుప రాడ్డు పడి గాయాలు

పట్నంబజారు: ప్రభుత్వాసుపత్రిలో వ్యక్తిపై ఇనుప రాడ్డు పడి గాయాలపాలైన సంఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటెపాడుకు చెందిన కామిశెట్టి సుబ్బారత్నం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి గుండె పరీక్షల కోసం ఆదివారం ఉదయం వచ్చి చూపించుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో జీజీహెచ్‌లోని పై భాగం నుండి ఒక ఇనుప రాడ్డు కిందకు జారి ఆయనపై పడింది. ఆయనకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కారుపై పడిన చెట్టు

లక్ష్మీపురం: చంద్రమౌళినగర్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా అటుగా వెళతున్న కారుపై పడింది. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో కారులో ఉన్న వారు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న వారిని స్థానికుల సహాయంతో బయటకు తీసుకొచ్చారు.

### ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికలు నిర్వహించాలంటూ నిరసన



నెహ్రూనగర్: ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికలు నిర్వహించాలంటూ స్టేడియం సభ్యులు, వాకర్స్ ఆదివారం స్టేడియం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో అని అధికారులను అడిగితే నిర్వహణ తేదీని ముందుస్తు సమాచారం కింద అందరికి తెలియజేస్తామని దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఎన్నికలు నిర్వహించి స్టేడియం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### పరిశుద్ధ ఆదివారపు ఆరాధన

నగరంపాలెం: స్థానిక కొత్తపేట ట్రినిటి గురు మండలంలో ఆదివారం ఈ సంవత్సరపు యువజనుల పరిశుద్ధ ఆదివారపు ఆరాధన నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏఈఎల్‌సీ కంట్రోలర్ కార్యదర్శి జస్టిస్ ఎస్.జేసురత్నకుమార్, సంఘకాపరులు రెవ.జె.దైవాశీర్వాదం, పి.రమేష్, ట్రినిటి కోశాధికారి లెనిన్ పాల్గొన్నారు.

### ముగిసిన అమరావతి నృత్యోత్సవం



నగరంపాలెం: భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు లలిత కళలు అని జాతీయ సేవా పథకం రాష్ట్ర అధికారి మద్దినేని సుధాకర్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్, కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్స్ ఆర్ట్స్ సంయుక్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న అమరావతి నృత్యోత్సవాలు–25 శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో కళారత్న రాయన గిరిధర గౌడ్, దేవస్థానం పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వర రావు, అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శి, నాట్య విశారద కోకా విజయలక్ష్మి, ఫెస్టివల్ సమన్వయకర్త కూచిపూడి రవి పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యంతో మేలు

లక్ష్మీపురం: ప్రకృతి వైద్యంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నేచురోపతి విశ్రాంత వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం .ఉమాసుందరి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ చంద్రమౌళిక మాట్లాడారు. అనంతరం వైద్యులను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వి.వి.రావ్, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.